
# ఈవారం కథ



# స్టేటస్

విజయకుమారి

ఆఫీసు నించీ అయిదు గంటలకే బయటపడ్డా రెండు బస్సులు మారి ఫర్లాంగు నడిచి ఇంటికొచ్చేసరికి ఆరు కొట్టారు.

బట్టలు మార్చుకుంటూ "పిల్లలేరీ?" అన్నాడు గోపాలరావు నిశ్శబ్దంగా వున్న ఇల్లు చూసి.

"క్రికెట్ ఆడుకోడానికి వెళ్ళారు.. ఎదురింటి ప్లీడరుగారి పిల్లలొచ్చి పిలుచుకు వెళ్ళారు." అంది శారద భర్తకు టవలు అందిస్తూ.

"వాళ్ళ మొహం వాళ్ళకేమొచ్చు ఆ క్రికెట్టూ..." నవ్వాడు గోపాలరావు.

"మన పిల్లలా! రెండు రోజుల్లోనే పట్టేశారు. వాళ్ళకన్నా బాగా ఆడుతున్నారుట. వస్తేగాని వీల్లేదని చదువుకుంటున్నవాళ్ళని లాక్కెళ్ళారు" గొప్పగా చెప్పిందామె.

"ఆహా, సిచింద్రీలే మొత్తానికి... ఎందులోనూ వెనకబడరు.." కొడుకులిద్దరూ తన గౌరావన్ని నిలబెట్టినట్లు ఆనందపడ్డాడు.

కాళ్ళూ, చేతులు కడుక్కువచ్చేసరికి కాఫీతో పాటు వేడిగా అరటికాయ బజ్జీలు కూడా తెచ్చింది శారద.

ఈ ఊరొచ్చాక రోజూ ఏదో ఒక టిఫిను చేస్తూనే వుంది. అంతవరకూ ఆదివారాలు తప్ప టిఫిను చేసేది కాదు.

తనూ ఓ ప్లేటులో పెట్టుకుని తింటూ "ఇవాళ షాపింగుకు వెళ్ళామండీ.."అంది ఉపోద్ఘాతంగా.

"షాపింగా! చాలా కొత్త మాటలు వచ్చాయే ఇక్కడ కొచ్చాకా" సరదాగా అన్నాడు గోపాలరావు.

"చాల్లెద్దురూ బడాయి. నేనంత పల్లెటూరి బైతునా ఏం" మూతి ముడిచింది.

"అమ్మమ్మ.. ఆ మాట ఎవరనగలరు. బస్తీ దొర సానివైతె ఇవ్వదు. ఇంతకీ ఏం కొన్నారో చెప్పనే లేదు"

"మీరు చెప్పనిస్తేగా..!"

"నువ్వు చెపితేనా..!"

"ఊ, చాల్లెండి... మాటలు నేర్చారు" ముద్దుగా విసుక్కుంటూ లేచి బీరువాలోంచి రెండు చీరలు తెచ్చి ఇచ్చింది చూడమన్నట్లు.

పాము కుబుసాల్లా మెత్తగా, హరివిల్లులాంటి రంగులతో అందంగా వున్న ఆ చీరలు చూస్తూ "చాలా బాగున్నాయి. ఎవరికేం?" అన్నాడు.

"నాకే..."

"రెండూ నీకే!?"

"ఏం చెయ్యమంటారండీ! అక్కడికీ వద్దు వద్దు అని అంటూనే వున్నా, వినిపించుకుంటేనా! క్రొత్త సరుకు రాగానే ఫోను చేస్తారుట బట్టల కొట్ల వాళ్ళు. వాళ్ళు వెళుతూ నన్ను రమ్మన్నారు. ఏం పోయింది చూసి రావడమే కదా అని బయ లుదేరా. వాళ్ళ కారులోనే వెళ్ళాం. ఇంటావిడో డజను చీరల దాకా తీసింది. కోడళ్ళకీ, కూతు ళ్ళకీ, తనకీ అంటూ. నన్ను కూడా తీసుకోమని బలవంత పెట్టారు. ఇవ్వడు కాదండీ, ఊరికే చూద్దామని వచ్చాను. డబ్బు కూడా తేలేదు అని చెప్పినా వాళ్ళు వొప్పకోందే. మేము మాత్రం ఇవ్వడు ఇస్తున్నామా! మా ఖాతాలో రాయిస్తాం లెమ్మని పట్టుబట్టి వాళ్ళే తీశారు. ఏదో వందా రెండు వందల్లో తీసుకుందామనుకుంటే అక్కడ ఐదు వందలకి తక్కువ చీరలు వుండవట. వాళ్ళే సెలక్టుచేసి తీశారు ఈ రెండూను. పదకొండు వందలు.." బెంగగా చూసింది శారద.

పెళ్ళయిన పదేళ్ళలోనూ ఒక్కసారే రెండు చీరలు కొనుక్కోడం గాని, అదీ ఒక్కోటి అయిదు వందలు పెట్టి కొనడం గాని ఎరగదు. అసలా ఊహ కూడా రాలేదామెకెప్పుడూను.

వున్నంతలో సర్దుకు పోవడం, పిల్లలు ఎదుగు తున్నారంటూ పదో పరకో మిగిల్చి బేంక్‌లో జమ చేసుకోడం... అంతే తెలుసు.

"సరె కానీ.. వాళ్ళతో సమానంగా కారుమీద తీసుకెళ్ళినప్పుడు ససేమిరా వద్దని చెప్పడం ఏం బాగుంటుంది! ఎటూ నేను లోనుకి అప్లై చేశాను గదా. రాగానే సగం ఇద్దాం. కొన్నాళ్ళు పోయాక మిగతాది సర్దుదాం.." అన్నాడు గోపాలరావు.

తేలిక పడింది శారద మనసు. "నేను కట్టే ఈ వంద రూపాయిల ప్రింటు చీరలు ఇక్కడ పని మనుషులు కూడా కట్టరండీ. అవి కట్టుకు తిరగబోతే చచ్చే సిగ్గుగా వుంటోంది. నగానట్రా లేకపోయినా శుభ్రమైన బట్టలైనా లేకపోతే ఏం బావుంటుంది చెప్పండి..!" తన బాధ వెళ్ళబోసు కుంది సందర్భం కుదిరిందిగదా అని.

ఇన్నాళ్ళూ ఇలా ఆలోచించవలసిన అవసరం రాలేదు ఇద్దరికీ. ట్రాన్సఫర్ మీద తాటికొండ నుంచి విజయవాడ వచ్చేరు.

ఉద్యోగం వచ్చింది మొదలు పన్నెండు ఏళ్ళుగా ఆ ఊరు వదిలింది లేదు. ట్రాన్సఫర్ వచ్చినప్ప డంతా ఏదో ఒక సాగు చెప్పో తెలిసిన వారిద్వారా చెప్పించో తప్పించుకుంటూ వచ్చారు.

ఈసారి వాళ్ళ ఎత్తులేమీ పారక తప్పని సరిగా మారవలసి వచ్చింది. విజయవాడలో అద్దె ఇల్లు దొరకడం మాటలా! అందునా అక్కడ తెలిసిన వాళ్ళుకూడా ఎవరూ లేరు.

కొలీగ్‌ద్వారా ఎనిమిది వందల అద్దెలో ఓ ఇల్లు ఖాళీగా వుందని తెలిసింది. తన కొచ్చే మూడు వేల జీతంలో అంత అద్దె పెట్టలేనని తెలిసినా తక్కువలో ఇల్లు ఎప్పటికి దొరుకుతందో; అంత వరకు భోజనానికి, పిల్లల చదువులకు ఇబ్బంది అవుతుంధని ముందెక్కడో ఓ చోట చేరితే అప్పుడు తమ కందుబాటులో వుండే ఇల్లు చూసుకోవచ్చ నుకుని ఓ వాటాలో దిగిపోయారు.

చాలా డీసెంటు ఏరియా అది.

నల్ల డబ్బు తెలువు చేసే ప్రయత్నంలో అవత రించిన ఇద్రభవనాలవి. ప్రతి ఇంటికీ ఔట్‌హౌస్, చుట్టూ తోట, కార్లు, స్కూటర్లు, ఫోన్లు, టి.వి.లు, వి.సి.ఆర్.లు ఇలా అన్ని హంగులతో సామాన్యు లకి ఆ వీధిన నడవాలంటే బెరుకు కలిగించేలా వుంటుంది.

గోపాలరావు పని అందుకేం భిన్నంగా లేదు. వచ్చిన పదీ పదిహేను రోజుల వరకు ఊపి డారవట్లు ఫీలయ్యాడు, నేరం చేసినవాడిలా తల దించుకుని తిరిగేవాడు. మనుషులు ఎవరూ లేకుండా చూసి మసిలేవాడు.

తన నెల జీతం ఖరీదు వుంటుంది వాళ్ళు తొడుక్కునే ఒక్కో జతా బట్టల విలువ. కార్ల మీద, స్కూటర్ల మీదా తప్ప నేల మీద నడ వరెవ్వరూ. వేలూ, లక్షలు తప్ప వందల గురించి మాట్లాడుకోరు ఎవరూ.

తనో!? రూపాయికి, అర్ధ రూపాయికీ లెక్క చూసుకుంటాడు. శారదైతే మరీను. ప్రతి పైసా చూసి చూసి ఖర్చు పెడుతుంది.

ఇప్పుడు వీళ్ళున్న ఇల్లు రిటైర్డ్ కలక్టర్‌గారి ఔట్‌హస్. కొడుకులూ, కూతుళ్ళు విదేశాల్లో స్థిరపడగా, మనవడిని పెట్టుకుని వుంటున్నారు భార్యాభర్తలు.

ఆవిడ సోషల్ వర్కరు. ఎప్పుడూ ఏదో ఒక పని మీద బయటే గడుపుతుంది. తోడు కోసం అద్దెకి చ్చారుగాని డబ్బుకోసం కాదు.

ఒక్కోరోజూ గడుస్తుంటే పరిసరాలు అలవా టయి కాస్త కాస్త బెరుకూ, బిడియం తగ్గసా గాయి. నీటికీ, గాలికీ కరువులేదు. పరిశుభ్రమైన పరిసరాలు. సంస్కారవంతమైన వాతావరణం.


స్థల మహత్యమో ఏమో తనకూ గుర్తింపు వస్తోంది. అనామకంగా పడివున్నాడు ఇన్నాళ్ళూ.

ఇందాక ఆఫీసు నించి వస్తుంటే వీధి మొదట్లో మూడంతస్థుల మేడ కట్టిస్తున్న సుబ్బరాజుగారు పిలిచారు. ఇల్లంతా తిప్పి చూపించారు. "ఎలా వుందండీ? ఇంకా ఏమైనా మార్పులు చేయ వలసి వుంటే చెప్పండి" అన్నాడు. అంత పెద్ద వ్యాపారస్థుడు ఒక మామూలు గుమ్మస్తాకి విలు వనివ్వాల్సిన పనేం వుందసలు.

"ఏదోనండీ, తోచినట్లు కానిస్తున్నా. వంటరి వాడిని అటు బిజినెస్ వ్యవహారాలు, ఇటు ఇంటి పని. ఇబ్బందిగా వుందనుకోండి..." అంటూ తన సాధక బాధకాలు ఆత్మీయుడికి చెప్పకున్నట్లు చెప్పకొచ్చాడు.

పనులన్నీ చాలా వరకూ అయినట్లేనట. కార్తీక మాసంలో గృహప్రవేశం చెయ్యాలనుకుంటున్నారట. లైటింగ్ పనే ఆగిపోయింది. "ఈ ఎలక్ట్రిసిటీ వాళ్ళతో మా పేచీగా వుందండీ. ఒక్కడిని ఎన్నిటి కని తిరగను! నేనెక్కడ లేకపోతే అక్కడ పనులు ఆగిపోతున్నాయి.. అన్నట్లు మీ కలక్టరేట్ దగ్గరే కాబోలు కరంటాఫీసు కూడా. కాస్త దీని సంగతే మిటో కనుక్కోగలరా?!" ఎంతో మొహమాట పడుతూ అడిగాడాయన.

తనకి చాలా జాలి వేసింది. అలాగే చూస్తాన న్నాడు. ఖర్చుల కుంచమంటూ నాలుగు వందలు



ఇవ్వబోయాడు. "మాట సాయం ఇందులో డబ్బు ఖర్చేం వుంటుందండీ" అని తను తీసుకోలేదు.

"ఇప్పుడు నాకు నిశ్చింతగా వుందండీ.." అన్నాడాయన గేటుదాకా వచ్చి సాగనంపుతూ.

"మొదట్లో భయపడ్డంగాని శారదా, అంతా మంచివాళ్ళే. డబ్బుందని లక్షాధికార్లమని కాస్తన్నా గర్వం లేదు ఎవరికీ" అంటూ సుబ్బరాజుగారి విషయం చెప్పాడు గోపాలరావు.

"నిజమేనండీ! ఇంటావిడ కూడా అంతే. వాళ్ళింటికి ఎవరొచ్చినా నన్ను పిలిచి మరీ పరిచయం చేస్తుంది. తనతోపాటు మీటింగులకి పార్టీలకీ కూడా తీసుకెళుతుంది. ప్లీడి వంటలు చేయవలసి వచ్చినా నాదే-పెత్తనం వంట ఇల్లు అప్పగిస్తుంది.." అంది శారద.

ఈ మధ్య ఇదొక దినచర్యగా మారింది ఇద్దరికీ. కాఫీ తాగుతూ ఆ వీథిలోవాళ్ల గురించో, ఇంటివాళ్ల గురించో చర్చించుకోడం..

టిఫిన్ పూర్తిచేసి కాఫీ తాగుతుండగా వచ్చాడు కిరణ్ "అంకుల్ మా తాతయ్యగారు రమ్మంటున్నారు" అంటూ.

"వస్తున్నా పద బాబూ" గబగబా గ్లాసు ఖాళీ చేసి వొంకీనున్న చొక్కా తగిలించుకుని మేడపైకి వెళ్లాడు గోపాలరావు.

రాజారావుగారికి చదరంగం పిచ్చి బాగా వుంది. గోపాలరావుకి కూడా చదరంగంలో ప్రవేశం వుందని తెలిసి సంతోషపడ్డాడు.

అతను ఆఫీసు నుండీ రాగానే కబురు చేస్తాడు రెండు ఎత్తులు వేద్దాం రమ్మని.

కలక్టరంతటాయన పిలుస్తుంటే కాదని ఎలా అవగలడు! ఆయన్ని కలుసుకోడానికి వచ్చేవాళ్లకి కూడా తన గురించి గొప్పగా పరిచయం చేస్తాడు గదా పాపం!

* * *

"ఇంతాలస్యమైందేం? రాజారావుగారు రెండుసార్లు కబురు పెట్టారప్పుడే" అంది శారద, దీపాలు పెట్టాక నీరసంగా ఇల్లు చేరిన భర్తను చూసి.

ఆనలిమధ్య కాస్త నలతగానే కనబడుతున్నాడు మనిషి. వ్యాపకాలూ ఎక్కువే అయ్యాయి. ఏదో ఒక పని మీద వెళ్లినట్టు చెపుతాడు. ప్లీడరుగా రేపోమాపురమాయించారంటాడు. ఇంజనీరుగారేదో చెప్పి పెట్టమన్నారంటాడు. ఇప్పుడు కొత్తగా ఎలక్ట్రిసిటీ పని మీద పెట్టుకున్నాడు. రెండు పూటలా దాని గురించే తిరుగుతున్నాడు.

ఆయన తన మీద అంత నమ్మకం పెట్టినందుకు పని పూర్తిచేస్తే మర్యాదగా వుంటుంది. అందుకే అవసరమనుకున్నచోట పది రూపాయిలు ఖర్చుపెట్టవలసి వచ్చినా వెనకాడడం లేదు. వాళ్లు విసుక్కున్నా కసురుకున్నా దులిపేసుకుని తిరుగుతున్నాడు వాళ్ళ చుట్టూ.

> **▶ బొద్దుకు- అడవికి జానెడు దూరం**
>
> * భమిడిపాటి మాష్టారు విసిరిన చెణుకు
>
> ఆ రోజుల్లో అడవి బాపిరాజుగారికి, బొద్దు బాపిరాజుగారికి అంతగా సయోధ్య వుండేది కాదు. అది అందరికీ తెలిసినదే. ఒకానొక సభకు కట్టమంచి రామలింగారెడ్డిగారు అధ్యక్షులు. వారికి చెరొకపక్క బొద్దు వారు, అడవి వారు ఆసీనులయ్యారు. అది చూసి మాష్టారు అన్నారట- "ఇప్పుడు బొద్దుకు, అడవికి మధ్య దూరం జానెడే!"
>
> ఈ ఛలోక్తులు అప్పటి 'భారత రత్న' ఆంగ్లపక్ష పత్రిక సంపాదకులు శ్రీ ఎస్.ఎస్. కృష్ణాజీ తన డైరీలలో వ్రాసుకున్నారు.
>
> —సేకరణ: డాక్టర్ వి. రాజగోపాలరావు

"తాటికొండలో వుండగా ఎంత ఉత్సాహంగా వుండేవారు! ఈ నీళ్లు పడలేదో ఏమిటో" దిగులుగా చూసింది శారద.

"అబ్బే అదేం లేదు. నడిచిరావడం కదూ! రిక్షా లెక్కాలంటే ఏడిస్తావా ఎనిమిదిస్తావా అంటున్నారు. డబ్బులనుకున్నారో చిల్ల పెంకులనుకున్నారో.." రిక్షా వాళ్ల మీద విసుక్కుంటూ బట్టలు మార్చుకుని కాళ్లూచేతులు కడుక్కువచ్చాడు.

టీ, టిఫినూ తెచ్చింది శారద. "సైకిలు బొత్తిగా మూలపడేశారు. దాన్ని వాడుకోకూడదటండీ" అంది.

"ఆ డొక్కా... ఛఛ.. పనిపాటలు చేసుకునే కూలి జనం కూడా "లూనా" మీద తిరుగుతున్నారు. ఇక్కడందరూ నేనేదో పెద్ద ఉద్యోగస్తుడినన్నట్లు చూస్తుంటే వాళ్ళ ముందు ఆ లంఖణాల బోటు వేసుకుని తిరిగితే..." తన ప్రిస్టేజి కెంత దెబ్బో ఆలోచించమన్నట్లు చూశాడు గోపాలరావు.

ఏమనలేకపోయిందామె కూడా.

మాట్లాడుతూనే నాలుగు గుక్కల్లో టీ తాగేసి మేడ మీదికెళ్లబోతున్న భర్తతో "పిల్లల గురించి బొత్తిగా పట్టించుకోడం లేదు మీరు. ఆ ఇంగ్లీషు పాఠాలేమిటో నాకు అర్థంకావు చెపుదామన్నా" అంది.

"చూస్తూనే వున్నావుగా, నాకు తీరికెక్కడ వుంది చెప్పు.." అంటూ మేడ మీదికెళ్లిపోయాడతను.

ఆ మాటకొస్తే శారదకీ క్షణం తీరిక వుండడం లేదు. మహిళామండలి కార్యక్రమాలు, సినిమాలు, పార్టీలు.

విజయవాడ వచ్చిన ఆరు నెలల్లో మా ఆమె కట్టూబొట్టూ, మాట తీరులో ఎంతో మార్పు వచ్చింది.

కోటేశ్వరరావంతటివాడే నోరు వెళ్లబెట్టాడు వాళ్ల హైక్లాసు వ్యవహారం చూసి.

వాళ్లత్తగారు కాస్త కలిగిన వాళ్ళవడాన తోటి గుమస్తాల కన్నా కొద్దిగా మెరుగ్గా వుంటాడు. గోరంతలు కొండంతలు చేసి ఊదరకొట్టడంలో అఖండుడు.

అలాటి కోటేశ్వర్రావు కొత్తగా వచ్చారు గదాని వాళ్లింటికొచ్చాడో రోజు గోపాలరావు వెంట.

ఆ వీథిలో అడుగుపెడుతూనే అతని నోరు పడిపోయింది. వీథి కటూ ఇటూ వున్న సినిమా సెట్టింగుల్లాంటి ఇళ్ళూ, ఇళ్ళ ముందున్న కార్లూ నోరు వెళ్లబెట్టుకుని చూశాడు.

ఇంట్లోకొస్తూనే "అద్దె ఎంత? పన్నెండు వందలకి తక్కువ వుండదు" అన్నాడు మొజాయిక్ ఫ్లోరింగూ ముందు గదిలో వున్న షోకేసూ చూసి.

ఇల్లంతా తిప్పి చూపించి భార్యను పిలిచాడు గోపాలరావు పరిచయం చేద్దామని.

లానులో గార్డెన్ చెయిర్స్ వేసుకుని పేకాడుతున్న మహిళామణుల్లోంచీ లేచి వస్తున్న శారదను కళ్ళింత చేసుకుని చూశాడు కోటేశ్వర్రావు.

క్రీమ్ బిస్కెట్లు తిని టీ తాగుతుండగా కిరణ్ వచ్చాడు తాతగారు పిలుస్తున్నారని.

"ఎందుకూ?" ఆశ్చర్యంగా ఇంగ్లీషు వాళ్ళబ్బాయిలా వున్న కిరణ్‌ని పరకాయిస్తూ గోపాలరావు వైపు తిరిగి అడిగాడు.

"ఛస్ ఆడ్డానికిలే... ఆయన కలెక్టరుగా చేసి మొన్నే రిటైరయ్యారు" అదేదో మామూలు విషయమన్నట్టు చెప్పాడు గోపాలావు.

తన సహజ గుణాన్ననుసరించి ఆఫీసులో ఏం చెప్పాడో ఏమోగానీ గోపాలావుని ప్రత్యేకంగా గౌరవిస్తున్నారు తోటి ఉద్యోగులు.

అతనేదో ఆస్తిపరుడని, కాలక్షేపం కోసం ఉద్యోగం చేస్తున్నాడన్న అభిప్రాయాన్ని కలగచేశాడు కోటేశ్వర్రావు.

ఆ సంగతి శారదకి చెప్పాడు నవ్వుకుంటూ "చూడు, వాళ్ళేమనుకుంటున్నారో" అని.

"అంతేగదండి మరి, ఏం తిన్నది, ఎలా వున్నది ఎవరూ చూడరు. పైకి కనపడే వేషభాషలనిబట్టే స్టేటస్ పెరుగుతుంది" అన్నది గర్వంగా శారద.

* * *

ఆ రోజు ఫస్టు తారీకు.

జీతం తెచ్చి చేతికిచ్చాడు గోపాలావు. దానికోసమే ఎదురుచూస్తున్నది శారద. ఆమె కిప్పుడు డబ్బు అవసరం బాగా వున్నది.

తీర్చవలసిన బాకీలు, కొనవలసిన సామాన్లు.

లెక్కపెట్టింది గబగబా. ఎనిమిది వందలు కొద్దిగా చిల్లర. ఆశ్చర్యంగా చూసింది భర్తవైపు.

"ఈ నెల నుంచీ లోను కట్ చేస్తారుగా మరి. అదీగాక అంతకు ముందు పిల్లల్ని కాన్వెంటులో చేర్చినప్పుడు మా కో క్లర్కు దగ్గర తెచ్చిన పది హేను వందల్లో కొంత ముట్టచెప్పాల్సి వచ్చింది..."

వివరించాడు.

అద్దె, కరంటు పోను ఇంకా ఏం మిగులుతుంది? కోపం వచ్చింది శారదకి.

"జీతం వచ్చాక ఇద్దాంలే అన్నారని మొన్న ఇంజనీరుగారమ్మాయి పుట్టినరోజు పార్టీకి పాతిక రూపాయల్లో స్టీలు బాక్సు అప్పతెచ్చాను. మహిళామండలి సెక్రటరీగారింట్లో వరలక్ష్మి పూజకు వెళ్తూ ముప్ఫయ్ అయిదు రూపాయిల పాలిస్టర్ జాకెట్టు ముక్క అప్ప తీసుకున్నానా... ఇవి రెండూ తీర్చాలా... మళ్లీ అవసరపడి అరువడిగితే పుట్టాలా వద్దా...!"

"తొందరపడకు శారదా. అన్నీ ఆలోచించాను. ఇవే కాదుగా. పచారీ షాపులో కొంతైనా చెల్లుబెట్టక పోతే సరుకులివ్వడు కదా! పిల్లల రిక్షాకి, పనిమనిషి, పాలు, కూరలు, నా ఆఫీసు బస్ ఛార్జీలు... ఇలా ఇంకా చాలా వున్నాయిగా. మా ఆఫీసులో ప్యూను గురవయ్య ఐదు రూపాయిల వడ్డీకి రెండు వేలు ఇస్తానన్నాడు. సంవత్సరం వరకూ అడగడట. ఏ నెల వడ్డీ ఆ నెల ఇస్తే చాలుట. రేపెల్లి తెస్తాను. ముందు అద్దె ఇచ్చిరా. మర్యాదగా వుంటుంది" అన్నాడు గోపాలావు.

భారం దించినట్లు తృప్తిపడింది శారద.

కరువులో అధిక మాసమని ఆ నెలలోనే వచ్చారు గోపాలావు తల్లీతండ్రీ.

రాజమండ్రి దగ్గర చిన్నలంక వాళ్లుండేది. ఎవ్వడోగాని పొరుగూళ్లకు వెళ్లరు. మనుమలను చూసినట్లూ వుంటుంది, కనకదుర్గమ్మ దర్శనమూ చేసుకోవచ్చని.

బయటకెళ్ళినప్పుడు తప్ప చొక్కా తొడుక్కోరు విశ్వనాథంగారు. ముతక నీరుకావి పంచె, వీబూది రేఖలు, జంధ్యం పొ గుతో మామగారు, నాలు చీర, మట్టి గాజులు, పసుపు తాడు, నల్లపూసలతో రూపాయి కాసంత కుంకం బొట్టుతో అన్నపూర్ణమ్మగారు.

శారదకు తేళ్లూ, జెర్రులూ పాకుతున్నట్లుగా వుంది వంటి మీద. తమ పేదరికాన్ని ఎత్తిచూపడానికే వచ్చినట్లున్నారు.

పుట్టింటివాళ్ల గురించీ, అత్తింటివాళ్ల గురించే చాలా ఉన్నతంగా చెప్పింది అక్కడివాళ్లకు. తన పరువేంకావాలి మరి. అన్నీ అబద్ధాలని నవ్వుకోరూ!

ఎవ్వరొచ్చినా అగ్గగ్గలాడుతుంటూ మర్యాదలు చేసే కోడలు ఈసారి తమని చూసి మొహం చిట్లించుకోడం, ఏటికీ మాటకీ విసుక్కోడం ఎందుకో అర్థంచేసుకోలేకపోతోంది అన్నపూర్ణమ్మగారు.

కోడలి స్టేటస్ పెరిగిందని ఆమెకేం తెలుసు పాపం! పాతకాలం మనిషి...!

దినమొక యుగంగా గడుపుతున్నది శారద, ఎప్పుడెళతానంటారా అని ఎదురుచూస్తూ.

వారం గడిచింది. వెళతామన్న మాట ఎత్తలేదు.

ఇక తప్పదని తనే చెప్పింది భర్తతో "వీళ్ల సంగతేంటండీ బొత్తిగా. నేనేమో ఎంతో ఘనంగా చెప్పాను... అందరూ ముసిముసి నవ్వులు నవ్వుకోడమే. మన పరువు తీసేదానికే వచ్చినట్లు కనపడుతోంది. పంపించేయకూడదూ..." అంది.

భార్య మాట అతనికి కూడా సబబుగానే తోచింది. "రేపు నేను క్యాంపుకెళ్తున్నాను. రాగానే ఏదో ఒకటి చెప్పి పంపిస్తాను. ఈ రెండు రోజులూ కాస్త కనిపెట్టి వుండు" అన్నాడు ఆమెకు నచ్చచెప్తూ.

* * *

రెండు రోజులన్నది నాలుగు రోజులు పట్టింది క్యాంపు.

అతనికి చాలా ఆదుర్దాగా వుంది. 'ఎల్లుండే సుబ్బరాజుగారింట్లో గృహప్రవేశం. నాలుగు రోజులు సెలవు పెట్టమని ముందే చెప్పాడాయన. క్యాంపు మూలాన కుదిరింది కాదు. రెండు వందలు ఖర్చు అయితే అవుగాక పని పూర్తిచేసి పెట్టినందుకు ఎంత పొగిడాడు... 'నా తమ్ముడు లాంటి వాడండీ' అంటూ అందరికీ చెప్పాడు. ఫంక్షన్ రోజు చూపించాలి తన తడాఖా. నలుగురూ శభాష్ అనేలా ఆర్గనైజ్ చెయ్యాలి..."

ఆనందంగా కలలుకంటూ వచ్చిన గోపాలావుకి పిడుగులాంటి వార్త చెప్పారు రాజారావుగారు. "మీరు వెళ్ళిన మర్నాడే ఇల్లు ఖాళీచేసి వెళ్ళారు" అని ఇంటి గుర్తులు కూడా చెప్పారు.

ఏం జరిగి వుంటుందో ఊహించలేకపోయాడు.

ఆయన చెప్పిన అడ్రసుకి తేలిగ్గానే చేరాడు.

రెండు గదులు, వరండా వున్న పెంకుటిల్లది. అద్దె మూడు వందల యాభై. ఆ పేట, ఆ వీథి, ఆ మనుషులు, ఆ పరిసరాలు చూస్తుంటే అతనికి కంపరంగా వుంది. స్వర్గం నించి నరకంలోకి విసిరివేసినట్టు.

"ఏమిటిది? ఇల్లెందుకు మారారు?" కోపంగా అడిగాడు ఇంట్లోకి అడుగు పెడుతూనే.

"నన్నడుగుతారేం, మీ నాన్నగారి నడగండి. ఆయన చేసిన నిర్వాకమే ఇదంతా. నన్ను మాట్లాడనిచ్చారా, మీరొచ్చిందాకా ఆగుదామంటే వద్దు అన్నది కూడా చెప్పకుండా సామానంతా రిక్షాల్లో వేసి తీసుకొచ్చారు" ఉక్రోషంగా చెప్పింది శారద.

పళ్లు మండిపోయింది గోపాలావుకి. ఎంత అసూయ! నలుగురిలో గౌరవంగా వుండడం చూడలేకపోయాడా! "ఏరీ మా నాన్న?" అన్నాడు మండుతూ.

"ఎక్కడున్నారు... అమ్మనీ కొంపలో దించి ఆ రోజే వెళ్ళిపోయారు మీకు ఉత్తరం రాస్తామని."

ఆఫీసుకి వెళ్ళిందాకా ధుమ ధుమలాడుతూనే వున్నాడు గోపాలావు. అతని గొంతు విని ఇంటి యజమాని వచ్చాడు పలకరించడానికి.

చదువుకున్నవాడని, ఉద్యోగస్థుడని ఎంతో మర్యాదగా, మన్ననగా మాట్లాడాడు చేతులు నలుపుకుంటూ.

మొహం ముడుచుకునే సమాధానం చెప్పాడు గోపాలావు.


"అమ్మాయ్, ఏదన్నా కావలసి వస్తే మీ పిన్నిని అడుగమ్మా. మొహమాట పడక..." అని శారదకు చెప్పి గుమ్మంలోంచే వెనుదిరిగి వెళ్ళిపోయాడు.

అక్కడుండగా మొక్కులు చూడ్డానికో, మరో పనికో ఔట్ హౌస్ వైపు వస్తే ఇంట్లోకి పిలిచి వద్దనకొద్దీ కాఫీ, ఫలహారాలిచ్చి పంపేవారు. ఆయన అవి స్వీకరించడమే తమకు మహా భాగ్యమన్నట్లు మాట్లాడేవారు భార్యాభర్తలు అగ్గగ్గలాడిపోతూ.

ఆఫీసుకెళ్లగానే తండ్రి రాసిన ఉత్తరం కనపడింది బల్ల మీద. పరుగున చింపాడు తండ్రి మీద వున్న కోపమంతా కాగితం మీద చూపిస్తూ.

"చిరంజీవి గోపాలరావుని ఆయురారోగ్యవంతునిగా దీవించి వ్రాయునది.

నేను చేసిన పని నీకు ఆగ్రహం కలిగిస్తుందని తెలుసు. అయినా నీ క్షేమం కోరే తండ్రిగా చొరవ చూపించక తప్పలేదు. అక్కడకొచ్చిన రెండు రోజు



ల్లోనే మీ పరిస్థితి అంతా గ్రహించాను. మీ కోసంగాక మీ చుట్టూ వున్నవారిని తృప్తిప రచడం కోసం బ్రతుకున్నట్లుంది మీరు. ప్రతి పనీ ప్రతి మాటా ఎవరేమనుకుంటారో అన్నట్లు భయపడుతూ చేస్తున్నారు తప్ప ఈ పని మాకి ష్టమైంది కనుక చేసుకుంటాము అని ధైర్యంగా చేసుకోలేకపోతున్నారు.

ఎక్కడా పది రూపాయిలు చేబదులు చేయని మువ్వు వడ్డీలకు అప్పులు తేవడం, లోను తీసు కోడం ఏ మాత్రం వెరవు లేకుండా చేస్తున్నావు.

ఇదంతా ఎందుకు అంటె మీరూ డబ్బున్న వాళ్లే పనీ, మీకూ స్టేటస్ వుందనీ భ్రమింపచేయడానికి. ఆ భ్రమను నిలపడం కోసమై తప్పనిసరిగా అప్పులనే జారుడు మెట్టుపై కాలు వేశావు. ఆడం బరంగా జీవించాలన్న కోరిక కలగడమే మనిషి పతనావస్థకు ప్రథమ సోపానం.

ఐశ్వర్యానికి కొలబద్ద ఏముంది? ఒకరిని మించి ఒకరు గొప్పవారెంతమందో వున్నారు.

ఆర్థిక ఇబ్బందులున్నవాడు ఎంత ధనవంతుడైనా పేదవాడితో సమానం. ఆర్థిక ఇబ్బందులు లేనివాడు ఎంత పేదవాడైనా ధనవంతుడితో సమానం అన్న సూక్తి నీకు తెలియదా!

ఆస్తి అంతస్థు వున్నవాళ్ళతో చెలిమి వలన నీకు వొరిగిందేమిటి? కానీ వాళ్ళు మాత్రం నీ బల హీనతని చక్కగా ఉపయోగించుకుంటున్నారు. ఇంటి విషయాలూ, పిల్లల చదువులూ పట్టించుకునే తీరిక కూడా లేకుండా అంతటి ధనవంతులు నాతో మాట్లాడిందే చాలని ఎవరే పని అప్పగించినా కాదనకుండా చేసిపెడుతున్నావు. వాళ్ళకు ఖర్చ య్యేది నాలుగు తియ్యని మాటలే. నీకో! విలువైన సమయం, డబ్బు!

ఇంటిపనంతా చేసుకుని తీరిక సమయాల్లో కూరల పాదులు, పూలమొక్కలు పెంచి కూరల ఖర్చు, పూల ఖర్చు తగ్గించే కోడలు సినిమా లకీ, షికార్లకీ, పేకాటకీ అలవాటు పడుతోంది. పాతిక రూపాయలిచ్చి కాఫీ, టిఫిన్లిచ్చి పని మని షిని పెట్టుకుంది. ఎందుకు? స్టేటస్ కోసం.

ఇక మీకా బాధ వుండదు. ఇప్పుడు నేను చూసిన ఇల్లు మన తాహతుకి తగినది. అక్కడ వున్నవాళ్ళు మనలాంటి మధ్యతరగతివారే. ఎవరి కోసమో అప్పులు చేయనక్కరలేదు. ఎవరికీ భయపడుతూ బ్రతకనక్కరలేదు. మొదట కోపగించుకున్నా కొద్ది రోజుల్లో నేను చేసిన పనిలోని మంచిని గ్రహించ గలవు అప్పుడు నన్ను తప్పకుండా మెచ్చుకుంటావు. ప్రస్తుతం నా దగ్గరున్న రెండు వేల రూపాయిలను పంపుతాను. కొన్ని అప్పులైనా తీర్చేయి. నిదానంగా నాకు ఇద్దువుగాని. కోడలికీ, మనుమలకీ ఆశీ స్సులు.

ఇట్లు

మీ తండ్రి విశ్వనాథం

◆


అతడు సినారె

జనం గుండెల్లో అతడి పాట జణుకు జణా జణారె

తెలుగు సినీ ప్రేక్షక హృదయాన్ని దశాబ్దాల తరబడి దోచు కుంటూన్న వన్నెల దొరసాని

డాక్టర్ సి. నారాయణరెడ్డి పాట.

ఏ పాట వెనుకయినా ఒక నేపథ్యం వుంటుంది. అందులో కవి సొంత అనుభూతులు, ఉద్వేగ ఉత్తేజాలు, ఆనంద విషాదాలు అతడి సామాజిక అనుభవాలతో కలగలిసి వుంటాయి. వీటి క్రీనీడలో పాటు తాలూకు సందర్భం, పాత్రల స్వభావం చేరి ఆ గేయానికి ఒక మధుర రూపాన్ని కూరుస్తాయి. అలా పాప్యులర్ లిరిసిస్ట్

డాక్టర్ సి.నారాయణరెడ్డి

గేయాల వెనుక దాగిన కథలు ఇక నుంచీ మీకు వారం వారం!

"పాటలో ఏకముంది - నా మాటలో ఏకముంది"

ఆసక్తికరమైన కథనం స్వయంగా సినారె అందిస్తున్నారు. అవధరించి ఆనందించండి!



త్వరలో ప్రారంభం!


స్వాతి సచిత్ర వారపత్రిక 6-1-95